www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025
5
అన్నమయ్య



ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనం ఆరోగ్యంగా జీవించవచ్చునని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మదర్ రఫీ అన్నారు. బుధవారం మండలంలోని విఠలంలో ప్రజలకు మలేరియా మాసోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో రుతుపవనాలు వలన వర్షాలు పడటంతో నీటి నిల్వలు ఉండడంతో దోమల వృద్ధికి దారి తీస్తాయన్నారు. దోమలు పెరిగి మనుషులను కుట్టడం వలన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పనికిరాని డబ్బాలు, పెంకులు, వాటర్ గ్లాస్‌లు, ఐస్‌క్రీం కప్‌లు, కొబ్బరి చిప్పలు వంటివి లేకుండా చూసుకోవాలన్నారు. రోజు సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముజీబ్‌బాష, రెడ్డెమ్మ, అరుణ, నాగరత్న, వలి, రమణ పాల్గొన్నారు.

డిసిహెచ్‌ఎస్‌లో ప్రమోషన్లేవీ!

- 15 ఏళ్లుగా సబార్డినేట్ల నిరీక్షణ
- ఆందోళనలో క్లాస్-4 ఉద్యోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల సబార్డినేట్ ఉద్యోగులు దశాబ్దాలుగా ప్రమోషన్లకు నోచుకోవడం లేదు. 2010 నుంచి 2025 వరకు 15 ఏళ్లుగా సబార్డినేట్ తదితర ఉద్యోగులకు ప్రమోషన్లు అందని ద్రాక్షను తలపిస్తున్నాయి. ప్రభుత్వం ఏటా ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు పెద్దఎత్తున నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తమకు ఎందుకు ప్రమోషన్లు కల్పించడం లేదని సబార్డినేట్, తదితర ఉద్యోగులు వాపోతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 16 కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రులు ఉన్నాయి. కడప, చెన్నూరు, కమలాపురం, బద్వేల్, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, వేంపల్లి కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల్లో సబార్డినేట్ స్థాయి ఉద్యోగులు మొదలుకుని వాటర్ కమ్ వాచ్‌మెన్, ఎఫ్‌ఎన్‌ఒ, ఎంఎన్‌ఒ, జిడిఎ కేటగిరీల పరిధిలో తొమ్మిది మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఆరుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వీరందరూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన వారు కావడంతోనే దశాబ్దాలుగా ప్రమోషన్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో తమకు ప్రమోషన్లు లభించి ఉంటే పలు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు లభించేవని చెబుతున్నారు. సబార్డినేట్ తదితర ఉద్యోగులు పలుమార్లు కమిషనర్ మొదలుకుని, కలెక్టర్, డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్ల వరకు వినతిపత్రాలు అందజేశామని, కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లభించకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. గతంలోని డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్లు తమ ప్రమోషన్లను పట్టించుకున్న పాపానపోలేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు ప్రమోషన్లు కల్పిస్తే జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ తదితర ప్రమోషన్లు లభించే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్లు ఉద్యోగుల అర్హతల ఆధారంగా ప్రమోషన్లు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది. ఉద్యోగుల దగ్గర స్కిల్స్ లేకపోవడం వల్లే ఇవ్వలేకపోతున్నామనే వాదన వినిపిస్తోంది. సబార్డినేటర్లు ప్రమోషన్ ఇచ్చిన తర్వాత స్కిల్స్ పరీక్షించాలని, ఇవ్వకుండానే స్కిల్స్ లేవనే పేరుతో అన్యాయం చేయడం సబబు కాదని వాపోతుండడం గమనార్హం. ప్రస్తుత బదిలీల నేపథ్యంలోనైనా తమ విజ్ఞప్తులను కలెక్టర్, డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్ తమ విజ్ఞప్తులను పరిశీలించాలని కోరుతున్నా రు.

డిసిహెచ్‌ఎస్ ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదు

డిసిహెచ్‌ఎస్ ఆస్పత్రుల్లో అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి. లేనిపోని కారణాలతో చిరు ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదు. లేనిపక్షంలో ఉద్యోగుల తరపున ఉద్యమం చేపడతాం.

- పి.వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి, కడప.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ విద్యుత్ : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద మూడు కిలోవాట్ల పవర్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.78 వేల రాయితీ ఇస్తారని, కిలో వాట్ పవర్ సోలార్ ఇన్‌స్లేషన్ ద్వారా 120 విద్యుత్ యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందని, బిసి వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అదనంగా రూ.20 వేల రాయితీ ఇస్తారని, ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించే పాలసీ రూపకల్పన జరగనుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యుత్ శాఖ ఎస్‌ఇ, ఇఇలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్స్టాల్ చేసే వెండర్లు, ఎంపిడిఒలు, తదితరులతో అన్నమయ్య జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వారు ఫిబ్రవరి 2024లో ప్రారంభించారని, ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఇన్స్టాల్ చేసుకుని సోలార్ విద్యుత్తును వాడుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లా విద్యుత్ శాఖ, సోలార్ పవర్ ఇన్స్టాలేషన్ వెండర్లు, నెడ్క్యాప్ వారు సమన్వయంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద సోలార్ పవర్‌ను ఇన్‌స్టాల్ చేసుకునే లబ్ధిదారులకు ఏ మేరకు రాయితీ ఇవ్వబడుతుంది, ఇతర అంశాలపై ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా వివిధ అంశాలు పేర్కొన్నారని దానిని ఉపయో గించుకొని జిల్లాలో రిజిస్ట్రేషన్లు చేయించాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకుల ద్వారా లోను తీసుకుని సోలార్ పవర్‌ను ఇన్‌స్టాల్ చేయించుకోవాలనుకునేవారు ఎల్‌డిఎం, డిఆర్‌డిఎలను సంప్రదించే విధంగా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఒక కిలోవాట్ సోలార్ పవర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే 120 యూనిట్ల వరకు విద్యుత్‌ను వాడుకోవచ్చని తద్వారా దాదాపు రూ.640 విద్యుత్ చార్జీ తగ్గుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ఇన్‌స్టాల్ చేసుకోవాలనుకునే రిజిస్ట్రేషన్లు పెరగాలని విద్యుత్ శాఖ సిబ్బందిని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా సోలార్ విద్యుత్తు అందించే విధంగా ప్రత్యేకంగా నూతన విధానాన్ని తీసుకురానున్నందున బిసిలు, ఒసిల మీద దృష్టి సారించాలని వారి దగ్గర నుండి వీలైనన్ని ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌పిడిసిఎల్ శాఖ ఎస్‌ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇలు, డిఇలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

-'వెన్నుపోటు దినం' నిరసనలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ఓటు వేసిన ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కడప రింగ్ రోడ్డు నుంచి అన్నమయ్య సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో 143 హామీలను ప్రజలకు ఇచ్చారని అన్నారు.అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని అన్నారు. నిరుద్యోగభృతి ఇవ్వలేదని, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారని, 50 ఏళ్ల దాటిన బిసిలకు పింఛన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారం కోసం ప్రజలను నమ్మించి మోసం చేయడం సిఎం చంద్రబాబు నైజమని అన్నారు. కూటమి ప్రభుత్వ తీరుతూ అన్ని రంగాలు వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. విద్యార్థులు, మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఇలా ప్రతి వర్గం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ డిఆర్‌ఒ మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపిపి గడికోట జనార్ధన రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యర్తలు ర్యాలీగా పట్టణంలోని వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించి అర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ, హామీల బాధ్యత నాది అన్న పవన్ నువ్వెక్కడ' అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కడప పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ శివసాయి, తల్లెం భరత్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఎలగచర్ల శివారెడ్డి, జిల్లా కో-ఆప్షన్ నెంబర్, అన్వర్‌బాషా, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్బరామరాజు, జడ్‌పిటిసి రత్నమ్మ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు-మదనపల్లి మార్గంలోని ఈద్గా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎంపిపి కంభం సతీష్ కుమార్‌రెడ్డి, హరీష్ రెడ్డి, జడ్‌పిటిఇ ఏటి రత్నశేఖర్ రెడ్డి,



పీలేరులో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు

పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, అబ్దుల్ కలీం, నల్లారి తిమ్మారెడ్డి పాల్గొన్నారు. **వీరబల్లి :** వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం రాజంపేటలో ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం ర్యాలీ కి మండలం నుంచి వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం:** మండలంలోని 13 గ్రామ పంచాయతీల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. నల్లగుట్టపల్లి రాచపల్లి సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గువ్వల చెరువు ఎంపిటిసి మౌలాలి మండల కో-ఆప్షన్ మెంబర్ జిలానీ, చిట్లూరు సర్పంచ్ రామానుజులుతో భారీగా వైసిపి శ్రేణులు తరలి వెళ్లారు. **రాజంపేట అర్బన్ :** రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, శాసనమండలి సభ్యులు రమేష్‌యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు నాయుడు అని వైసిపి అధికారి ప్రతినిధి, యాంకర్ శ్యామల పేర్కొన్నారు. మదనపల్లె వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోటు దినోత్సవంలో వైసిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయం నుంచి వైసిపి శ్రేణులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంకు వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం శ్యామల విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటు పొడవడంలో మాస్టర్ డిగ్రీ చేశారన్నారు. 1994 ఎన్నికల అనంతరం సొంత మామ స్వర్గీయ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి అధిష్టించారన్నారు. ఆ తర్వాత నాలుగు సార్లు వెన్నుపోటు పొడుస్తూనే ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 2024 ఎన్నికల్లో అమలు గాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది కాలంలో పసికందులకు రక్షణ కల్పించలేక వెన్నుపోటు పొడిచారన్నారు. ఆడపిల్లలకు రక్షణ కరవైందని అబద్ధపు హామీలు గుప్పించారన్నారు. రైతన్నల కన్నీటి తడి తో ఆడుకున్నారని, విద్యార్థులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఎండియూ వాహనాలు రద్దుచేసి లక్షలాది మందిని రోడ్డుపై లాగారని, దగా డీఎస్సీతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడారన్నారు. ఇలా చెప్పుకుంటూ ఇచ్చిన ప్రతి హామీకి వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనుజారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వేకోడూరులో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు, నాయకులు



బాధితులకు సెల్‌ఫోన్లను అందిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

భారీగా మొబైల్ ఫోన్లు స్వాధీనం

- బాధితులకు అందించిన ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : రెండు నెలల వ్యవధిలో వాట్సాప్, మొబైల్ నెంబర్, సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రూ.1.20కోట్లు విలువ చేసే 601 మొబైల్ ఫోన్ల రికవరీ చేసినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏడవ విడత మొబైల్ ఫోన్ల రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నుంచి 2025 మే వరకు 13 వందల మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు, దొంగిలింపబడినట్లు ఫిర్యాదులు అందాయని అన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం ఒక నెల వ్యవధిలో మొబైల్ ఫోన్లను అన్నమయ్య జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎస్ మొహమ్మద్ అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ టి.జాన్ జోసెఫ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సిబ్బంది మొబైల్ ఫోన్‌లను ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారని, వాటి విలువ రూ.1.20కోట్లు ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు ఏడు విడతల్లో 1627 మొబైల్ ఫోన్లను సుమారురూ.3.16కోట్లు విలువ చేసే మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించినట్లు తెలిపారు. ఎవరైనా మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే జిల్లా పోలీస్ ఎల్ఎంటిఎస్ వాట్సాప్ నెంబర్ 8688830012 అనే నెంబర్ కు హాయ్ అని మెసేజ్ చేసిన వెంటనే గూగుల్ లింక్ వస్తుందని ఆ లింకును క్లిక్ చేసి వివరాలను నమోదు చేయాలని అన్నారు. బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ వివరాలను బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎలాంటి రుసుం చెల్లించకుండా బాధితులకు అందిస్తామని అన్నారు. ప్రస్తుత కాలంలో సమాచార చేరవేతకు వినోదానికి, విజ్ఞానంకోసం, ఇతర అత్యవసర సమాచారం కోసం మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని చాలా సందర్భాలలో ప్రజలు తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడం, దొంగతనానికి గురవడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందులో వ్యక్తిగత బ్యాంకు ఇతర గోప్యమైన వివరాలు ఉండడం ద్వారా నేరస్తులు వాటిని దుర్వినియోగం పరవచ్చని అన్నారు. సెల్ ఫోన్ దుకాణం నిర్వాహకులు ఎవరైనా తెలియని వ్యక్తులు మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసినా, అమ్మినా బిల్లు తప్పనిసరి ఉండాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించడంలో కృషిచేసిన సైబర్ క్రైమ్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ పి.రాజారమేష్, కె.రాజారెడ్డి, డిసిఆర్‌బి సిఐ తులసీరామ్, టాస్క్ ఫోర్స్ సిఐ మధు, రాఘవరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శంకర్ మల్లయ్య, రిజర్వ్ సిఐ రామకృష్ణ, పెద్దయ్య పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మంజునాథ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సిడిపిఒ సుజాత, సూపర్‌వైజర్ శాంతమ్మ హాజరవుతారన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు చేస్తారని చెప్పారు. ముఖ్యంగా ఇసిజి ఎకో, ముందస్తుగా కేన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని అన్నారు.. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు లోకేష్ భరణి వైదేహి హాస్పిటల్ 9535197749, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆవులు, ఒంటెల వధ నిషేధం

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

ఆవులు దూడలు, ఒంటెల వధ నిషేధం, చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ ఆవులు దూడలు, ఒంటెల వధ నిషేధం ,చట్టరీత్యా నేరం అనే అంశంపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆవులు దూడలు , ఒంటెల వధ నిషేధం అని, ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం 1960 ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం, పశు సంరక్షణ చట్టం 1977ల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై పాల్గొన్నారు.

ఆలయానికి 5 కిలోల వెండి వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరి పల్లెల్లో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ గర్భాలయ తాపడానికి గానూ 5 కిలోల వెండిని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి ఆలయ ధర్మకర్తలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం, వెండి వితరణ చేయడం తన అదృష్టమని అన్నారు. ఆయన మిత్రులు దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరిరెడ్డి 1కిలో వెండి వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పూల హరిప్రసాద్, కెవెస్ నరసింహ, ఎంఎల్ నరసయ్య, కావేరి గారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, కొమ్మూరు సుబ్బనరసయ్య, మాజీ సర్పంచ్ ఎంఎల్.నారాయణ పాల్గొన్నారు.

ఏడాది పాలనతో ప్రజలకు ఒరిగింది శూన్యం : పిసిసి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాహుకేతువులుగా మారి ప్రజలకు అరచేతిలో వైకుంఠం, కైలాసాన్ని చూపిస్తున్నాయని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షులు నిగార్ సుల్తానా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పులు చేయడంలో వైసిపిని కూటమి ప్రభుత్వం మించి పోయిందన్నారు. వైసిపి, టిడిపి కూటమి దొందూ దొందేనన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. వైసిపి రాష్ట్రాన్ని అప్పులు, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్, గంజాయి ఏపీగా చేస్తే, కూటమి పాలన అంతకంటే అధ్వాన్నంగా తయారైందని దుయ్యబట్టారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, నలభై బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారయిందన్నారు. పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయని అన్నారు. ప్రజలపై రూ. 15,485కోట్లు అదనపు భారం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో మోపిందని నిప్పులు చెరిగారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి అమలు కాలేదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని వక్ఫ్ బోర్డు ముస్లింలకు సంబంధించిన బోర్డు, ఇందులో ముస్లింలు కానివారిని నియమించడం అన్యాయమని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డుకు దానం చేయాలంటే 5 ఏళ్ల ఇస్లాం ఆచరించి ఉండాలనడం విడ్డూరమన్నారు. టిడిపి కూటమి పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిగార్ సుల్తానా మాట్లాడుతూ పార్టీలో అనుభవం కలిగిన తులసి రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా, డిసిసి మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిగార్ సుల్తానా, సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, సింగం రామకృష్ణారెడ్డి, నరసింహులు, అనిత, శంకరమ్మ, లక్ష్మీ, సీత, షర్మిలా, చరిష్మా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

అనంతపురం, నెల్లూరు జట్ల ఘన విజయం



తలపడుతున్న చిత్తూరు, అనంతపురం జట్లు



వీరారెడ్డి (125 నాటౌట్)

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచుల్లో అనంతపురం, నెల్లూరు జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై ఏడు వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 45.1 ఓవర్లలో 217 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెడ్డిరుషిల్ 60, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 3, ప్రదీప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 218 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంత పురం జట్టు 25.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కే హెచ్. వీరారెడ్డి అదుతేంగా బ్యాటింగ్ ప్రదర్శించి 125 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 69 బంతులను ఎదుర్కొని 14 బౌండ రీలు, 7బౌండరీ సిక్సులు సహాయంతో 125 పరుగులు చేశాడు. అర్జున్ టెండూల్కర్ 27 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మహమ్మద్, రెడ్డి ప్రకాష్, డేనియల్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరొక మ్యాచ్‌లో కడప జట్టుపై 13 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు 31.0 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 28, అఖిల్ సాలుంకే 26 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4, చెన్నారెడ్డి 3, విజయ భావేంద్రారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 146 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి సవిచూచింది. ఆ జట్టులోని నాగ చాతుర్య 32, షేక్ ఆదిల్ హుస్సేన్ 40 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాత్విక్ 3, సయ్యద్ అతిక్ సల్మాన్ 3, మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు.



ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న డిఎం నిర్మల

ఇంధన పొదుపు మనందరి బాధ్యత

- ఆర్‌టిసి డిపో మేనేజర్ నిర్మల

ప్రజాశక్తి-పీలేరు

ఇంధనం పొదుపు చేసి ఆర్‌టిసి ప్రజా రవాణా సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి సహకరించాలని పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. బుధవారంస్థానిక ఆర్‌టిసి గ్యారేజ్‌లో 2025 మే నెలలో అత్యధిక కెఎంపిఎల్ సాధించిన ఇద్దరు డ్రైవర్లకు అభినందన కార్యక్రమంతో పాటు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 137.69 లీటర్ల డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్ జికె స్వామికి ప్రథమ బహుమతిగా రూ.500, 135 లీటర్ల డీజిల్ పొదుపు సాధించిన డ్రైవర్ ఎంఆర్ మూర్తి కి రూ.300లు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇంధన పొదుపుతో ఆర్‌టిసి ఆదాయాన్ని పెంచడం ప్రతి ఒక్కరీ బాధ్యతగా భావించాలని సూచించారు.కార్యక్రమంలో గ్యారేజ్ ఎఎంఎఫ్ హరినాథ్ రెడ్డి, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఇఒ రవీంద్రనాయక్

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో ఉన్నటువంటి అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఎంఆర్‌సి భవనంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ఎం.రవీంద్రనాయక్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. పిల్లలకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించడం వలన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా నమోదు అవుతుందని అన్నారు. ఏజెన్సీలు కూడా చక్కగా పరిశుభ్రతను పాటించాలని అన్నారు. వంటల పోటీలు నిర్వహించి మొదటి బహుమతిగా లీపి పొంగల్ గాను లక్ష్మీదేవికి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, సిఆర్‌పిలు గంగయ్య ప్రేమలత పాల్గొన్నారు.



నగదును అందిస్తున్న ఆంజనేయులు

ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీ పెద్దూరులో వెలిసిన చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి తమ్ము గింజల ఆంజనేయులు రూ.25 వేలు విరాళం అందించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును దేవాలయ ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడేశ్వరి దేవి ఆలయ నిర్మాణం కొరకు దాతల సహకారం అవసరం ఉంద న్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న అర్జున తపస్సు

ప్రజాశక్తి-పీలేరు

మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా జరిగిన అర్జున తపస్సు కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. పీలేరు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో మహాభారత యజ్ఞం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన అర్జున తపస్సు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సంతాన భాగ్యం కోసం వరపడిన భక్తులు కూడా పాల్గొన్నారు. తపస్సు అధిరో హించిన అర్జు నుడు పైనుంచి విసిరే నిమ్మకాయలు, ఇతర ఫలాల కోసం జనం పోటీపడ్డారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు మహాభారత యజ్ఞ నిర్వాహకులు తీర్థ, ప్రసాదాలను వితరణ చేశారు.



అబ్బుర పరిచిన కళాకారుల ప్రదర్శనలు

ఘనంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి కోర్టు ఆవరణలో వెలిసిన కోర్టులో గంగమ్మ జాతర మంగళవారం రాత్రి, బుధవారం పగలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు కిరీటం తో ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం రాత్రి చేపట్టిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, చెక్కభజనలు, బళ్లారి డ్రమ్స్ అలరించాయి. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వేలాది మంది భక్తులు ఢీలు, బాణాలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. బక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఒకటో పట్టణ సిఐ ఎరిషావల్లి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి అమ్మవారి శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. అమ్మవారి జాతరను జయప్రదం చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులువేణుగోపాల్ నాయుడు, కరుణాకర్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, మహేష్, శ్రీనివాస్ నాయుడు, దేవేంద్ర, కృష్ణకుమారి, రంగప్ప నాయుడు, చిన్న రెడ్డప్ప ఆర్ సి శ్రీనివాస్ నాయుడు, మల్లికార్జున, చిన్న రెడ్డప్ప, శ్రీనివాసులు నాయుడు లు పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని ఒప్పంద సహాయ ఆచార్యులకు ఎన్నడూ లేని విధంగా సర్వీస్ పునరుద్ధరణకు ఆటంకం కలిగిస్తూ రివ్యూల పేరుతో అన్యాయం చేయటాన్ని ఖండిస్తూ కళాశాల అధ్యాపకుల బృందం ప్రిన్సిపల్ కార్యాలయం చేరుకుని నిరసన చేపట్టారు. గత 13 సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా ఇలాంటి చర్యలకు పాల్పడ టం సమంజసం కాదని అన్నారు. దీనివల్ల సుమారు 60మంది అధ్యాపక కుటుంబాల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారే అవకాశాలు కనిపి స్తున్నాయని అన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా, కళాశాల యాజమాన్యం అనధికారికం గా ఇలాంటి చర్యలకు పాల్పడటం తగదని వాపోయారు. ప్రతి సంవత్సర నామినల్ బ్రేక్ పీరియడ్ అనంతరం, జాయినింగ్ రిపోర్టుతో విధుల్లోకి తీసుకు నేవారు. కానీ ఈ సంవత్సరం అలాంటి ఏమి చేయకుండా, ఒక అనధికారిక సందేశం ద్వారా, విభాగాలు వారిగా వేరు వేరు సమయాలలో రివ్యూ పేరిట పిలవ టం సబబు కాదని తెలిపారు.ఈ విషయం గురించి చర్చించడానికి, కళాశాల అసోసియేషన్ సభ్యులు అనుమతులు కోరినప్పటికీ, ప్రిన్సిపల్, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు నిరాకరించటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేష్ స్పందించి, తక్షణమే అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని, 60మంది అధ్యాపక కుటుంబాలకు న్యాయం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలని కళాశాల అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు కోరారు.



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న అధ్యాపకులు

రేషన్ పంపిణీలో తేడాలొస్తే చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని పలు చౌక ధరల దుకాణాల్లో మంగళవారం తహశీల్దార్ నరసింహ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా కొన్ని దుకాణాల్లో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యంలో తేడాలు ఉన్నట్టు గుర్తించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కేటాయించిన మొత్తం బియ్యంలో కొంత భాగాన్ని దారి మళ్లించడం అక్రమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్య లు తప్పవు అని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇటి వద్దకే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన లబ్ధిదారుల వివరాలు సేకరించాలిన్నారు. దీనికి సంబం ధించి ప్రతి కార్డు హోల్డర్ చిరునామా వివరాలు స్థానిక సచి వాల యం వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉండే పెన్షన్ లిస్టు ఆధారంగా సరిచూ డాలని సూచించారు. ప్రజల హక్కులను కాపాడటమే అధికారుల బాధ్యత అన్నారు.

చౌక దుకాణాల్లో తనిఖీలు

కలకడ : మండలంలోని చౌక దుకాణాలను తనిఖీలు నిర్వహించినట్లు తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు. మండలంలోని దిగుపాలెంలో 2, 3 నంబర్ చౌకదుకాణాలను, కదిరాయిచెరువు 28వ నెంబర్ గల చౌక దుకాణాలను తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. చౌక దుకాణాలలో నిత్యావసర సరుకులను ఎలాంటి మోసాలు పాల్పడకుండా ,నిష్పత్తిపాతంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. 65సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇంటి వద్దకే వెళ్లి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సూచించామన్నారు. రేషన్ పంపిణీలో ఏవైనా అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు చౌక దుకాణాలలో సమయపాలన పాటించి, నిత్యవసర సరుకులకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా పలకరించి, వారికి నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని గుర్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒలు రామకృష్ణ, మహమ్మద్‌బాషా, డీలర్లు చలపతి, ఈశ్వర్ నాయుడు, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



కలకడ : వృద్ధులకు రేషన్‌ను అందిస్తున్న తహశీల్దార్

కొబ్బరి సాగులో తెల్ల దోమను నివారించాలి

- కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల



రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె సమన్వయకర్త మంజుల

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కొబ్బరి తోటల సాగులో తెల్ల దోమ నివారణకు రైతులు కృషి చేయాలని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల అన్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లెలో ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు తో కలసి రైతులకు కొబ్బరి, మామిడి తోటల సాగుతో పాటు వరి పంట సాగు, పంటను ఆశించే తెగుళ్లు, దోమల నివారణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొబ్బరి సాగులో ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న రూగోస్ తెల్ల దోమ వ్యాప్తిని నివారించి, అధిక పంట దిగుబడిని సాధించడానికి వేప నూనెను పిచికారి చేయాలన్నారు. మామిడి సాగులో తేనెమంచు పురుగు వృద్ధితి పూత, పిందె దశలోనే కాకుండా పంట కోత దశ వరకు ఉంటుందని, మందులను పిచికారి చేసుకోవాలన్నారు. జామ పంటలో పిండినల్లి వృద్ధి అధికంగా ఉంటుందని, దీని నివార ణకు అధికారులు సూచించిన సమయంలో మందులను పిచికారి చేయాలన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో మేలైన వరి, వేరుశనగ, తృణధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెవికె ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ టమాట పంటలో అధికారులు సూచించిన మేరకు తగిన మోతాదులో ఎరువులను వాడాలన్నారు. ఉద్యాన పంటలలో సూక్ష్మ పోషకాలను పిచికారి చేయడం వలన పంట నాణ్యత, దిగుబడి మెరుగుపడుతుందన్నారు. టమాటా పంట సాగులో ట్రైకోడెర్మా జీవసిలింద్రనాశని వాడాలన్నారు. ట్రైకోడెర్మా వాడడం వలన టమోటా, ఇతర ఉద్యాన పంటలలో నేల ద్వారా సంక్రమించే వ్యాధులను అదుపులో ఉంచు తుందన్నారు. మామిడిలో కాయ కోత అనంతరం 15 రోజుల విరామం తరువాత కొమ్మ కత్తరింపులు చేయా లన్నారు. కొమ్మ కత్తరింపుల ద్వారా మామిడిలో క్రమం తప్పకుండా పంటను తీసుకోవచ్చని తెలిపారు. కార్య క్రమంలో ఉద్యానవన శాఖ సహాయకులు జయకృష్ణవేణి, వెంకటరమణారెడ్డి, లక్ష్మీపతి, ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

-మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాలతి

ప్రజాశక్తి-కలికిరి

రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాలతి పేర్కొన్నారు. బుధవారం కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి సమావేశం మార్కెట్ యార్డ్‌లో మండి యజమానులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్‌పర్సన్ మాలతి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని సూచించారు. ముఖ్యంగా, టమాటా వేలం కార్యక్రమాన్ని ప్రతీరోజూ ఉదయం 5.30 గంటలకు ప్రారంభించాల్సిందిగా తెలిపారు. సమయపాలన పాటించడం వల్ల రైతులకు, వ్యాపారులకు సమర్థమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రతి లావాదేవీ పద్ధతిగా, పారద ర్శకంగా జరగాలని సూచించారు. మార్కెట్ యార్డును శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. మండి యజమానులు రైతులకు న్యాయం జరిగేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు వ్యక్తిగతంగా మార్కెట్ యార్డును సందర్శించి అక్కడి రైతుల, వ్యాపారులు, కార్మికులతో కలసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. ఈ సమా వేశంలో కమిటీ వైస్ చైర్మన్ సనాఉల్లా, డైరెక్టర్లు శ్రీనివాసవర్మ, రాం బాబు, తేజ, రాజగోపాల్‌రెడ్డి,మండి యజ మానులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులు మార్కెట్ ప్రాంగణాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేశారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాలతి



మహిళలకు చీరలు అందిస్తున్న అతికారి కృష్ణ

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

- జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా బుధవారం రాజంపేట జనసేన కార్యాలయంలో సుపరిపాలన మొదలై ఏడాది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అతికారి కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభి వృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. ఈ ఏడాదిలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, సామాజిక పింఛన్ల పెంపు, రాజధాని అమరావతి, పోలవరం పునర్నిర్మాణం, సిసి రోడ్లతో గ్రామాలకు మహర్దశ, బిసిలు, ఎస్‌సిలకు కార్పొరేషన్ రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి డబుల్ ఇంజిన్ రైలులా పరుగులు పెడుతుందని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌కు సన్మానం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన నాయకులు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను పూలమాలతో ఘనంగాసన్మానించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కళా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆడపడుచులకు ప్రత్యేకంగా రంగోలి పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీధర్ మహిళల రంగోలి పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పు ద్వారా ఏర్పడిన ఈ కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అనుభూతి చెందేలా సంక్షేమ పాలన అందిస్తోందని అన్నారు. మహిళల భాగస్వామ్యం ఏ ఉద్యమానికైనా శక్తిని అందిస్తుందని అన్నారు. అలాంటి వారి ప్రతిభను గుర్తించి ఈ రంగోలి పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో మరిన్నీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, మైసూరువారిపల్లి సర్పంచ్ సంయుక్త, జోగినేని మనీ, పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, దాశరధి, గిద్దలూరు భాన ప్రకాష్, రామసుబ్బయ్య, ఉత్తరాది శివ,కిషోర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

బక్రీద్ పండుగను శాంతి యుతంగా జరుపు కోవాలని సిఐ ఆర్. మోహన్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మత పెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ మతాల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుంచి విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. చివరి రోజు బహుమతులు అందజేశారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రంగాల్లో అవగాహన కల్పించామన్నారు. ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, ఉర్దూ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కమలనాథ్ శర్మ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నక్కలదిన్నె బీడీసీ రవిశంకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అద్భుత విజయాలు సాధించారు

ప్రజాశక్తి - ఖాజీపేట : ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది పాలనలో సిఎం చంద్ర బాబు అద్భుత విజయాలు సాధించారని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖాజీపేటలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లా డుతూ.. ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్దానాలు అమలుకు నోచుకుం టున్నాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టడం హాస్యాస్పదమన్నారు. మైదుకూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చెప్పిన మేరకు చెరువులు, శ్మశానాల అభివృద్ధి, రాజోలి జలాశయ నిర్మాణానికి కృతనిశ్చయంతో పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగపట్నం రామసుబ్బయ్య, ముత్తూరు రమణ, లక్కు పుల్లారెడ్డి పాల్గొన్నారు

చియ్యపాడులో రేపటి నుంచి గంగ జాతర

ప్రజాశక్తి - చాపాడు :మండలంలోని చియ్యపాడులో శుక్రవారం నుంచి సోమవారం వరకు గంగ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం నుంచి ప్రత్యేకపూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 7న గంగా కాటమరాజు కథ, 8న మద్దిమాను యాగం, 9న బండారు ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



ఎఎంసి చైర్మన్ రామమూర్తిని సత్కరిస్తున్న కార్మికులు

అభిమానం చాటుకున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తిని గ్రామపంచాయతీ కార్మికులు సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పీలేరు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బివి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, పీలేరు ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి బి. నాగార్జున, నాయకులు పులి రెడ్డప్ప, డి. రమేష్, రాజేశ్వరి, చిట్టెమ్మ, సరోజ, ధనభాగ్య, శ్యామల, నాగమ్మ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - ఖాజీపేట: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ శాఖ లక్ష్యమని ట్రాన్స్‌కో ఎడి శ్రీకాంత్, మండల ఇంజినీర్ నాగరాజ్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో విద్యుత్ అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ వినియోగదారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్తంభాలు ఒరిగి ఉండడం, తీగల కిందకి వేలాడడం వంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎ ఆది, స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, రాష్ట్ర మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, పూసల కొట్టాల సుబ్బయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామ దళితవాడలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలు ఆకుపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్తలు అంజనమ్మ నరసింహులు గ్రామస్తుల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి భజన, కోలాటం ప్రదర్శించారు. స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'న్యాయం జరిగే వరకూ పోరాడుతూనే ఉంటాం'

ప్రజాశక్తి - వేముల

కేకే కొట్టాల గ్రామ సమీపంలోని యురేనియం కర్మగారం నుంచి రసాయనాలతో కూడుకున్న వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్‌ను బుధవారం ఎఇఆర్‌బి వారు సందర్శించారు. విషయం తెలుసుకున్న కేకే కొట్టాల గ్రామస్తులు పెద్ద ఎత్తున అందరూ అక్కడికి చేరుకున్నారు. రైతులు అధికారులతో తమ సమస్యలు వివరించారు. టెయిలింగ్ పాండ్ వల్ల చుట్టుపక్కల గ్రామస్తులు చాలా ఇబ్బందులకు గురువతున్నారని, అనారోగ్య సమస్యలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట దిగుబడి రాక నష్టాలు చవిచూస్తూ అప్పులపాలవుతున్నామని వాపోయారు. యుసిఐఎల్ అధికారులకు పలుమార్లు చెప్పుకున్నా తమగోడు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎన్ని సమస్యలు చెప్పినా వారు కంపెనీవైపే సానుకూలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. తమ గ్రామానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని ప్రజలు అధికారులతో తేల్చి చెప్పారు.

క్రైం కార్నర్



షాపును పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

పాత కక్షలతో దుకాణం ధ్వంసం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవపల్లెలోని లక్ష్మీనరసింహ ఎలక్ట్రికల్ షాప్‌ని జాసర్ అనే వ్యక్తి పాతకక్షలతో ధ్వంసం చేసినట్లు షాపు యజమాని అక్కి వెంకటరమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మంగళవారం వెంకటరమణ తన షాపుని రాత్రి తొమ్మిదిన్నర గంటలకు మూసి వేసి ఇంటికి వెళ్లాడని అన్నారు. సుమారు 11.30 గంటల సమయంలో జాసర్ తన షాప్ షట్టర్ పగలగొట్టి అక్రమంగా షాపులోనికి ప్రవేశించి, షాప్ లోని మొత్తం సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు పదివేల రూపాయలు నగదును తీసుకువెళ్లాడని ఫిర్యాదు చేశాడని అన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన బుధవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని కొండామ ర్రిపల్లె పంచాయతీ, సత్యసాయి కాలనీలో నివాసమున్న చింతాకుల రెడ్డప్ప కుమారుడు శ్రీనివాసులు, ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు అందించినా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు సర్పరాజ్ (27) పుంగనూరు రోడ్ లోని ఓ ప్రయివేట్ కల్యాణ మండపంలో పనిచేస్తున్నాడు. ఇతని కి జిమ్ చేసే అలవాటు ఉండడంతో రోజు మాదిరే పట్టణంలోని జిమ్ సెంటర్ కు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో సర్పరాజ్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. స్థానికుల సమా చారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితని సమీక్షించి మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటం వల్లే సర్పరాజు ప్రమాదబారిన పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. తాలూకా సిఐ కళా వెంకట రమణ ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.